పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 102. అత్ తకాసుర్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. ఇందులో 8 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

మక్కాలో అవతరించిన ఈ సూరాలో ధనమే సర్వస్వం అనీ, జీవితం యావత్తూ ధనార్జనకే అంకితం చెయ్యాలన్న అభిప్రాయం తప్పు అని ప్రజలకు చెప్పబడింది. ఈ ధన వ్యామోహం మనిషిని అల్లాహ్ నుండి, ఆయన ఆరాధన నుండి ఏమార్చి వేస్తుంది. ఇంకా అది ప్రజలలో అనవసరమైన గర్వం, అహంకారం జనింపజేస్తుంది. అన్సారుల తెగలు రెండు ఉండేవి. బనీ హారిస మరియు బనీ అల్ హరస్. ఇవి ఒకదానికి పోటీగా మరొకటి ముందుగా బ్రతికి ఉన్నవారి గొప్పలు చెప్పసాగాయి. తర్వాత ఖబరస్తాన్ (గోరీలదొడ్డి)కి వెళ్ళి చనిపోయిన తమ వారి ఘనకార్యాలు చెప్పసాగాయి. జీవితంలో చేయవలసిన పనులు అనేకం ఉన్నాయి. కేవలం ధనం వెంట పరుగులు తీయడం అజ్ఞానం. మనపై అల్లాహ్ హక్కులు ఉన్నాయి. దైవదాసుల హక్కులు ఉన్నాయి. ఖుర్ఆన్ పఠనం కోసం, అర్థం చేసుకోవడం కోసం మనకు కొంత సమయం ఉండాలి. తౌబా ఇస్తెగ్ఫార్ చేయడం కోసం కూడ సమయం కావాలి. దైవారాధన కోసం కూడ సమయం కావాలి. ప్రాపంచిక కార్యాలూ నెరవేర్చాలి. ధర్మాన్ని ఆచరించాలి. కేవలం సంపదవెనుక పరుగుతీయడం అజ్ఞానం.

## 102. సూర అత్ తకాసుర్

**ఆయత్‌లు : 8** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) సిరిసంపదల్ని మరింత అధికంగా పొందాలన్న ఆలోచన మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది.

(2) చివరికి మీరు గోరీలలోకి చేరుకున్నారు.

(3) చూడండి! మీకు శీఘ్రంగానే తెలిసిపోతుంది. (4) ఇక చూడండి, అతిత్వరలో మీకు తెలిసిపోతుంది. (5) చూడండి, దాని పర్యవసానాన్ని ఎరిగినట్లయితే మీరు ఏమరుపాటు వహించకండి. (6) మీరు తప్పక నరకాన్ని చూస్తారు. (7) ఇక మీరు దాన్ని మీ కళ్ళారా చూస్తారు. (8) ఆ రోజు మిమ్మల్ని వరాల గురించి తప్పక ప్రశ్నించడం జరుగుతుంది. ఆ వరాలను పొంది కృతజ్ఞత చూపారా లేక నమ్మకద్రోహం చేశారా అని.

آیَاتُهَا 8 — سُوْرَةُ التَّكَاثُرِ مَكِّيَّةٌ 102 — رُكُوْعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

أَلْهٰكُمُ التَّكَاثُرُ ﴿1﴾

حَتّٰى زُرْتُمُ الْمَقَابِرَ ﴿2﴾

كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ﴿3﴾

ثُمَّ كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ﴿4﴾

كَلَّا لَوْ تَعْلَمُوْنَ عِلْمَ الْيَقِيْنِ ﴿5﴾

لَتَرَوُنَّ الْجَحِيْمَ ﴿6﴾

ثُمَّ لَتَرَوُنَّهَا عَيْنَ الْيَقِيْنِ ﴿7﴾

ثُمَّ لَتُسْـَٔلُنَّ يَوْمَئِذٍ عَنِ النَّعِيْمِ ﴿8﴾ ع 1 8 27

1 – 8 వాక్యాలు

ఈనాడు ప్రతి మనిషీ సిరిసంపదలలో ఇతరులను మించిపోవాలని భావిస్తున్నాడు. ఇదే అతని జీవిత లక్ష్యం అయిపోయింది. కనుక ఇటువంటి మనిషి ప్రాపంచిక వ్యామోహం కలవాడు, దారి తప్పినవాడు అని గ్రహించాలి. అతడికి గనుక ఆఖిరత్‌పై విశ్వాసం ఉంటే, ఆఖిరత్ గురించి తెలిసివుంటే, ఆఖిరత్ ప్రాముఖ్యత అతడు ఎరిగివుంటే, అతడు ఎంతమాత్రం ప్రాపంచిక వ్యామోహం కలిగి ఉండదు. ప్రపంచం నాశనమయ్యేదే. ఆఖిరత్ మిగిలి ఉండేదే. ప్రపంచం ఒక నీటి బిందువు అయితే, ఆఖిరత్ ఒక సముద్రం లాంటిది.